
www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 19 జులై 2025

5

తూర్పుగోదావరి



21న రోటరీ ఆధ్వర్యంలో చెస్ పోటీలు

నిడదవోలు : ప్రపంచ చదరంగం దినోత్సవం సందర్భంగా నిడదవోలు రోటరీ ఆడిటోరియంలో ఈ నెల 21న చెస్ పోటీలు నిర్వహిస్తామని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ప్రెసిడెంట్ మీసాల శివరామహరిప్రసాద్ శుక్రవారం తెలిపారు. జూనియర్స్ విభాగం 6,7,8 తరగతుల విద్యార్థులకు, సీనియర్స్ విభాగం 9,10 తరగతుల విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, పది కన్సోలేషన్ బహుమతులతో పాటు, పాల్గొన్న ప్రతి విద్యార్థికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందిస్తామన్నారు. ప్రతి పాఠశాల నుంచి జూనియర్స్ కేటగిరీ నుంచి నలుగురు విద్యార్థులు, సీనియర్స్ కేటగిరీ నుంచి నలుగురు విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. జులై 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పార్టిసిపెంట్ చెస్ బోర్డులు ఎవరికి వాళ్లే తెచ్చుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకోదలచిన వారు సెక్రెటరీ దారపురెడ్డి శ్రీరామ ప్రతాప్ 9966724647, 984848778లను సంప్రదించాలన్నారు.

గోకవరంలో ఆయిల్‌పామ్ విస్తరణ మహోత్సవం

హాజరైన ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి-గోకవరం

ఆయిల్‌పామ్ తోటల విస్తరణ మహోత్సవాన్ని గోకవరంలో శుక్రవారం ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ పామ్ ఆయిల్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని రైతులకు పామాయిల్ మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక సంఖ్యలో పామాయిల్ పంట సాగు చేసే నియోజకవర్గంలో జగ్గంపేట నియోజకవర్గం ముందు వరుసలో ఉంటుందన్నారు. ఇక్కడి రైతులు పామ్ ఆయిల్ సాగులో చాలా అనుభవం కలిగిన వారన్నారు. మిగిలిన రైతులు కూడా పామాయిల్ సాగు చేస్తూ మంచి ఆదాయం పొందాలని ఆకాంక్షించారు. పామాయిల్ పంట 100 సంవత్సరాలు ఫలసాయం ఇచ్చే పంట అన్నారు. రాబోవు కాలంలో గోకవరం మండలంలో నీటి పారుదలకు సంబంధించి భూపతిపాలెం, ముసురిమిల్లి, సురంపాలెం ప్రాజెక్ట్ లను అనుసంధానం చేస్తామని తద్వారా నీటి సమస్య లేకుండా చేస్తామని తెలిపారు. పెద్దాపురం ఫ్యాక్టరీ పరిధిలో రైతులు అందరూ మంచి సదుపాయాలు పొందుతున్నారని తెలిపారు. పతంజలి సంస్థ ఫౌండేషన్ విభాగాధిపతి వి.పట్టాభిరామిరెడ్డి మాట్లాడుతూ పతంజలి యాజమాన్యం ఎల్లప్పుడూ రైతు శ్రేయస్సునే కోరుకుంటుందన్నారు. రైతులకు సేవ చేయటంలో లాభాపేక్షకు పోకుండా ఎన్నో నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ పంట వలన రైతులు ఆర్థికంగా సుస్థిరత సాధించడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు మాట్లాడుతూ దేశంలో పామాయిల్ సాగులో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉందన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్.ప్రకాష్ మాట్లాడుతూ పామాయిల్ తోటల సాగులో గోకవరం మండలంలోని రైతులు అత్యధిక సంఖ్యలో ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అధిక సంఖ్యలో రైతులు 30 నెలలకే గెలలు కొడుతున్నారని, కొత్త విధానాలు అవలంబించడం, సాగులో యాంత్రీకరణ పద్ధతులు తీసుకురావడం వల్ల రైతులు అత్యధిక ఆదాయం పొందుతున్నారన్నారు. ఇక్కడి సారవంతమైన నేలలు పామాయిల్ పంటకు అత్యంత అనుకూలంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ అడపా భరత్‌కుమార్, గోకవరం విశాల సహకార పరపతి సంఘం గాజింగం సత్యనారాయణ, ఎస్‌విఎస్ అప్పలరాజు, దాసరి తమ్మన్న దొర, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ డివిఎస్.శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ కె.కార్తీక్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి డి.ఉమామహేశ్వరరావు, ఫీల్డ్ సూపర్‌వైజర్ ఎస్.శివ రైతులు పాల్గొన్నారు.



పామాయిల్ మొక్కను నాటుతున్న ఎంఎల్ఎ నెహ్రూ



ఎండిన పొలంలో రైతు

ఎండుతున్న వరి చేలు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

వానలు ముఖం చాటేయడంతో మండలంలో వరి చేలు ఎండుతున్నాయి. పొలాలు నీటి తడులు లేక పొలాలు బీటలు వారుతున్నాయని సలపూడి గ్రామానికి చెందిన కక్కిరాల వీర వెంకట సోమేశ్వరరావు, సుంకర చిన్న, సుంకర వీర్రాజు, సుంకర రామకిషోర్, కొమ్మరపల్లి వెంకటేశ్వరరావు, అల్లూరి శ్రీను, మొగళ్లపు మురళీకృష్ణ తదితర రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 500 ఎకరాల వరకు ఎండి పోయే అవకాశం ఉందని వారు తెలిపారు. పసలపూడి, గొడిపర్ల లాకులకు ఎగువన తమ పొలాలు ఉన్నాయన్నారు. లాకులకు దిగువన ఎక్కువ ఆయకట్టు ఉండడంతో అధికారులు అధిక శాతం నీరు కిందికి వదిలేస్తున్నారని, తద్వారా, కాలువ నీరు తమ పొలాలకు అందక, పంటలు ఎండిపోతు న్నాయని తెలిపారు. ఈ లాకులపై సత్యవాడ, చిలకపాడు గ్రామాలు కూడా ఆధారపడి ఉన్నాయన్నారు. చిలకపాడులో ప్రస్తుతానికి మోటార్లతో నీరు తోడుకోవడం వల్ల సాగునీటి ఎద్దడి పెద్దగా లేనప్పటికీ కష్టాలు మాత్రం ప్రారంభమయ్యాయని రైతు పోశేశ్వరరావు తెలిపారు. సమయానికి నీరు అందకపోవడం వల్ల ఇంజన్ బోర్లు, మోటార్ పంపులతో నీళ్లు తోడి తడులు పెడుతున్నామన్నారు. అధికారులు తమ సమస్యను పట్టించుకుని, సీజన్‌ను గట్టెక్కించాలని కోరుతున్నారు.

కాలుష్య రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం:

ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత సమాజానికి కృషి చేయాలని ఉండ్రాజవరం బౌద్ధ ధమ్మ పీఠం పీఠాధిపతి భంతే అనాలయో అన్నారు. వన మహెూత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మోర్త శ్మశాన వాటిక ప్రాంగణంలో పలు రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అనాలయో మాట్లాడారు. మానవుని చివరి మజిలీ వరకు కాలుష్య రహిత వాతావరణం అవసరమన్నారు. అందుకే శ్మశాన వాటిక ప్రాంగణంలో సైతం నీడనిచ్చే మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. భావితరాలకు మనమందించే సంపద కాలుష్య రహిత వాతావరణమేనన్నారు. అనేక సంవత్సరాలుగా మండలంలోని పలు గ్రామాలలో వనమహోత్సవాన్ని పుంస్కరించుకుని, నెలరోజుల పాటు మొక్కలు పంపిణీ చేయడమే కాకుండా మొక్కలు నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అనపర్తి జలమయ్య, దాసరి సుబ్రహ్మణ్యం, కొప్పినీడి సత్యనారాయణ, కంటిపూడి నరేంద్ర, మల్లేష్, పైపూరి మాణిక్యాలరావు, రాచమళ్ళ శ్రీనివాసరావు నిడుములు చిన్న రాము, కరుటూరి వెంకట దొర ప్రసాద్, కంటిపూడి రాంబాబు, వడ్డీ వెంకటేశ్వరరావు, అంతర్వేది పాలెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు..



శ్మశానంలో మొక్కలు నాటుతున్న అనాలయో తదితరులు

హాస్టళ్లలో ఎంపిడిఒ తనిఖీలు

ప్రజాశక్తి - పెరవలి

కలెక్టర్ ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఖండవల్లి ఎస్‌సి బాలుర హాస్టల్ కానూరు ఎస్ బాలుర హాస్టల్, బిసి బాలికల హాస్టల్స్‌లో ఎంపిడిఒ కెయుఆర్ఎల్.పద్మజ శుక్రవారం తనిఖీలుచేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. వంటశాల, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. మెనూపై ఆరా తీశారు. హాస్టల్‌తో పాటూ యూనిఫాం, పుస్తకాలు, షూస్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హాస్టల్ పరిసరాలల్లో కలుపు మొక్కల నిర్మూలనకు కలుపు మందు స్ప్రే చేయించారు. హాస్టల్ గదులతో పాటూ, కిచెన్ డైనింగ్ హాళ్లను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భావన మధు పూర్ణచంద్, ఎంపిటిసి సభ్యులు కోలా సీతయ్య నాయుడు, నాయకులు బి.రాజు, బి.రవికుమార్, వార్డెన్లు ఆనందరావు, వినోదరావు, శాంతకుమారి, ఎఇ సాయికుమార్, పంచాయతీ కార్యదర్శులు చక్రవర్తి, రాంబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

తల్లికి వందనంలో ఎస్‌సి విద్యార్థుల పట్ల వివక్షత

ప్రజాశక్తి-కడియం

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం నిధుల్లో 9,10 తరగతులు చదువుతున్న దళిత విద్యార్థులకు రూ.10,900, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రూ.8,200 మాత్రమే వారి అకౌంట్లో జమ అయ్యాయని వీరిపట్ల ప్రభుత్వం వివక్షత చూపడం అన్యాయమని వైసిపి మండల అధ్యక్షులు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. శుక్రవారం ఈ మేరకు ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. కొంత మంది దళిత పిల్లల తల్లుల అకౌంట్లో రూ.8,800 రూపాయలు మాత్రమే పడడంతో సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నారన్నారు. మండలంలోని జేగురుపాడుకు చెందిన ఎస్‌సి కులాలనికి చెందిన తొర్లపాటి నమ్రత 10వ తరగతి బాలిక తల్లి అకౌంట్లో రూ.8800రుపాయలు మాత్రమే జమ అయ్యాయని, అలాగే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న దళిత విద్యార్థి బడుగు జగన్ అకౌంట్లో రూ.8200 రూపాయలు మాత్రమే జమ అయ్యాయని పేర్కొన్నారు. కడియం మండలంలో సుమారు 1,500మంది దళిత విద్యార్థులు తల్లికి వందనంలో సాయం అందక ఎదురు చూస్తున్నారన్నారు. వీరికి తక్షణమే ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే దళిత విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో నిరసనకు దిగాల్సి వస్తుందన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి దుర్గేష్

సిసి రోడ్, డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - నిడదవోలు

పట్టణంలో సిసి రోడ్, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. నిడదవోలు పురపాలక సంఘం ఆధ్వర్యంలో రుడా, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.147.40 లక్షలతో వీటిని నిర్మించనున్నారు. 9, 10వ వార్డుల పరిధిలో ఉన్న ఆర్‌టిసి బస్టాండ్ జంక్షన్ నుంచి రామదాసు స్ట్రీట్ మీదుగా వీక్లీ మార్కెట్ జంక్షన్ వరకు ఈ నిర్మాణాలు చేపట్టనున్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన మంత్రి దుర్గేష్, రూడ చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు నిడదవోలు పట్టణంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రానున్న రోజుల్లో నిడదవోలు పట్టణాన్ని అభివృద్ధి చేసే ప్రణాళికను వివరించారు. ఈ కార్యక్రమంలో జెసి ఎస్.చిన్న రాముడు, కొవ్వూరు ఆర్‌డిఒ రాణి సుస్మిత, మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, మున్సిపల్ వైస్ చైర్మన్ వజీరుద్దీన్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మామూళ్లు చెల్లించకపోతేనే దాడులా?

మట్టి లారీల వ్యవహారంపై విమర్శలు

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం మండలంలో మట్టి అక్రమ తవ్వకాలు, మట్టి లారీలపై అధికారులు చేస్తున్న దాడులపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. మామూళ్లు సక్రమంగా అందని సందర్భంలో మాత్రమే దాడులు జరుగుతున్నాయి, మిగిలిన సందర్భాల్లో మట్టి యథావిధిగా అక్రమంగా తరలిపోతుందని స్థానికులు విమర్శిస్తున్నారు. శుక్రవారం పలు మట్టి లారీలను అధికారులు పట్టుకున్నారు. మండలంలో కలవచర్లలో పోలవరం ఎడమ కాలువ గట్టు మట్టి, పల్ల కడియం, కానవరం, జి.ఎర్రంపాలెం, కొత్త తుంగపాడు తదితర ప్రాంతాల్లో అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రతి రోజూ రాత్రి పగలు తేడా లేకుండా తవ్వకాలు, రవాణా సాగుతోంది. దీనిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా వెనుక కూటమి నాయకుల హస్తం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి. అక్రమార్కులు కూటమి నాయకులు, అధికారులతో ఒప్పందం చేసుకుని మామూళ్లు చెల్లిస్తున్నారనే వార్తలు ఉన్నాయి. అందువల్లే ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. మామూళ్లు చెల్లించకుండా తవ్వకాలు జరిపి మట్టి తరలిస్తున్న లారీలపైనే దాడులు జరుగుతున్నాయని, ఇదంత కూటమి నాయకుల ఆదేశాల మేరకే జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీలను తహశీల్దార్ జివివిఎల్ లక్ష్మి పట్టుకున్నారు. రాజానగరం సమీపంలో సూర్యారావుపేట జాతీయ రహదారి ప్రక్కన అపార్ట్మెంట్ నిర్మాణం కోసం లారీల్లో పొలాల్లో మట్టిని తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. దీనిలో ఆరు లారీలు కలవచర్ల పోలవరం కాలువ గట్టు మట్టి, మరో నాలుగు లారీలు పాలచర్ల పొలాల్లో మట్టికి అనుమతులు ఉన్నారన్నారు.



సీజ్‌చేసిన లారీలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ బలరామకృష్ణ

23న పొలాలకు సాగునీరు విడుదల

ప్రజాశక్తి - సీతానగరం

ఈ నెల 23న పంట పొలాలకు సాగునీటిన విడుదల చేస్తామని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ తెలిపారు. రాజమహేంద్రవరంలోని ఎంఎల్ఎ కార్యాలయంలో ఇరిగేషన్ అధికారులతో ఆయన శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాగునీటి సరఫరాపై పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న తీవ్రమైన ఎండలు, ఆకు మడులు ఎండిపోతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకుని సాగునీటి విడుదలకు నిర్ణయం తీసుకున్నామన్నారు. గతేడాది జులై 29న నీటిని విడుదల చేయగా, ఈ ఏడాది వారం ముందుగానే నీటిని విడుదల చేస్తున్నామన్నారు. చాగల్నాడు ఎత్తిపోతల పథకంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఈ పథకం పూర్తిగా ధ్వంసమైందన్నారు. పైపులైన్లు, మోటార్లు పాడైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని విడుదల చేయడం కష్టంగా ఉందన్నారు. వచ్చే ఏడాదికి చాగల్నాడు ఎత్తిపోతల పథకం పంపులు, పైపులైన్ల మరమ్మతులు పూర్తి చేస్తామన్నారు. ఎటువంటి అసౌకర్యాలు లేకుండా నీటిని అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సంవత్సరం అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామాల్లోని కాలువల్లో పూడికలను పూర్తి స్థాయిలో తొలగించామన్నారు. గతేడాది పూడికలు పూర్తిగా తొలగించకపోవడం వల్ల సాగునీరు అందించడంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఈ ఏడాది చివరి ఎకరా వరకు పూర్తి స్థాయిలో నీటిని అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఎఇ సత్యనారాయణ, రిటైర్డ్ డిఎస్‌పి కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సాయం : ఎంపీ

ప్రజాశక్తి- తాళ్లపూడి

ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల సాయం అందిస్తోందనిఎంపీ పురందేశ్వరి అన్నారు. మండలంలోని పెద్దేవం, వేగేశ్వరపురం, తాళ్లపూడి, అన్నదేవరపేట, సూరయ్యపేట గ్రామాల్లో రూ.3.24 కోట్లతో నిర్మించనున్న పనులకు, నిర్మాణాలు పూర్తి చేసుకున్న మంచినీటి ట్యాంకులు, డ్రెయినేజీలు, సిసి రోడ్లు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను ఆమె చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సకాలంలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేస్తుందన్నారు. దీనిలో భాగంగా అమరావతి అభివృద్ధికి రూ.26 వేల కోట్లు, పోలవరం అభివృద్ధి రూ.12,500 కోట్లు, స్టీల్ ప్లాంట్‌కి రూ.11,400 కోట్లతో పాటు రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్రాంట్ కింద రాష్ట్రానికి రావాల్సి నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తుందన్నారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలు అభివృద్ధి అనే విషయాన్ని మరిచిపోయారని, అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధి, సంక్షేమం సంకల్పంతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పద్మశ్రీ ప్రసాద్, కొవ్వూరు ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, ఆర్‌డిఒ రాణిసుస్మిత, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు నామన పరమేశ్వరరావు, తాళ్లపూడి సర్పంచ్ నక్కా అనురాధ, నాయకులు నక్కా చిట్టిబాబు, ఉడతా వీరేంద్ర ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ పురందేశ్వరి

సీనియర్ జర్నలిస్టు బండి సత్యప్రసాద్ మృతి

ప్రజాశక్తి - సీతానగరం




సీతానగరం మండలం పురుషోత్త పట్నం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బండి సత్యప్రసాద్ శుక్రవారం గుండెపోటుతో మరణించారు. ఆయన గుండెపోటుకు గురవ్వడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన రాజమహేంద్రవరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆయన ప్రజాశక్తి, ఆంధ్రప్రభ, సన్ న్యూస్ పత్రికల్లో పనిచేశారు, ప్రస్తుతం సివిఆర్ న్యూస్ చానల్‌లో పని చేస్తున్నారు. అంత్యక్రియలు నిమిత్తం బంధువులు అతని మృతదేహాన్ని స్వగ్రామం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం కుందూరుకు తరలించారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి-తాళ్లపూడి

మహిళలు కుటీర పరిశ్రమలపై దృష్టి సారించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని లఘు పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు ప్రతినిధితో పాటు పలువురు బ్యాంకు మేనేజర్లు సూచించారు. పరిశ్రమ ఏర్పాటుపై మహిళలకు మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు బ్యాంకు మేనేజర్లు మాట్లాడుతూ ఇప్పటికే వ్యాపారాలు చేస్తున్న మహిళలకు ఆ వ్యాపారాలను మరింత అభివృద్ధి చేసుకునే విధంగా పలు సూచనలు చేశారు. ఎలాంటి సహకారం కావాలో అడిగి తెలుసుకున్నారు. కొత్తగా పరిశ్రమ ఏర్పాటు చేయడానికి ఎటువంటి వస్తువులు మార్కెట్లో విక్రయించవచ్చు అడిగి తెలుసుకున్నారు. పరిశ్రమల స్థాపనకు మహిళలంతా ముందుకు రావాలని అన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎపిఎం మంగాయమ్మ, జిల్లా లఘు పరిశ్రమల అభివద్ధి బ్యాంకు అధికారి శ్రీనివాస్, డిఆర్‌డిఎ సెర్ప్ డిపిఎం జనార్థన్, తాళ్లపూడి యూనియన్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు, ప్రక్కిలంక స్టేట్ బ్యాంక్ మేనేజర్ రాజు, అన్నదేవరపేట బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్, మండల సమాఖ్య సిబ్బంది, పలు గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పిల్లల భద్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, ఉండ్రాజవరం

పిల్లల భద్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని అది అందరి బాధ్యత అని పలువురు వక్తలు అన్నారు. జిల్లాలో పలుచోట్ల చైల్డ్ ప్రొటెక్షన్ సమావేశాలను, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీల ఏర్పాటు కార్యక్రమాలను శుక్రవారం నిర్వహించారు. రాజమహేంద్రవరం అర్బన్ 50వ వార్డులో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ మీటింగ్ జరిగింది. 11 నుంచి 18 ఏళ్ల పిల్లలకు బాల్య వివాహాలు, వారిపై లైంగిక దాడులు జరుగకుండా చూడడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. చైల్డ్ లేబర్ లేకుండా చూడడం, పిల్లలకు భద్రత కల్గించడం, వారి అవసరాలు తెలుసుకొని వాటిని సమకూర్చే విధంగా సంబంధిత శాఖలతో మాట్లాడడం తల్లి తండ్రులతో మాట్లాడడం పిల్లలకు సెక్యూరిటీగా ఉండే విధంగా కమిటీ పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధికారిక అధికారి సిహెచ్. లక్ష్మీ, ఇన్‌చార్జి సిడిఒ నాగలక్ష్మి, సూపర్‌వైజర్లు బి.వరలక్ష్మి, ఎంఎస్‌కె ఎమ్‌డి ఆజ్ మున్నిసా, హెచ్.ఎం, ఎఎన్ఎం ఎమ్‌డి హసీనా, వార్డు ఇన్‌చార్జి శీలం గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండలం కాల్దారిలో నిర్వహించిన సమావేశంలో సిడిపిఒ ఆశారోహిణి మాట్లాడారు. చైల్డ్ ప్రొడక్షన్ కమిటీలు పిల్లల సంరక్షణ, బాల్యవివాహాల నిర్మూలన వంటి చర్యలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలన్నారు. చిన్నారుల సంరక్షణ కమిటీ, బాల్య వివాహాల నిర్మూలన కమిటీ ఏర్పాటుకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల హక్కులు, బాల్యవివాహాలను అరికట్టేందుకు కమిటీ సభ్యులు చేయాల్సిన కార్యక్రమాలు సూచించారు. ఇటువంటి సంఘటనలను గుర్తిస్తే సంబంధిత కమిటీలకు, అధికారులకు తెలియజేయాలని సూచించారు. గ్రామ మహిళా పోలీస్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ చీపుల్ల కుమారి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.బాల సరస్వతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, అంగన్‌వాడీలు, ఆశాలు, విఆర్ఒ తదితరలుఉ పాల్గొన్నారు. తాడిపర్రు ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై కిశోర బాలికలకు అవగాహనా కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు.



రాజమహేంద్రవరం సమావేశంలో మాట్లాడుతున్న సిడిపిఒ

కొంగల బెడదతో ఇక్కట్లు వార్తకు స్పందన

ప్రజాశక్తి -దేవరపల్లి

దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో కొంగల బెడదతో ఇక్కట్లు వార్తకు అధికారులు స్పందించారు. శుక్రవారం ఎంపిడిఒ, సర్పంచ్, గ్రామ కార్యదర్శి, గ్రామ రెవిన్యూ అధికారి, వైద్య సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని కొంగల బారిన పడి బాధపడుతున్న వారి నుంచి వివరాలు సేకరించారు. కొంగలు అక్కడ లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ముందుగా కొంగలు సంచరించే ప్రాంతంలో బ్లీచింగ్ చల్లించారు. మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆ ప్రాంతంలో ఎటువంటి దుర్వాసన లేకుండా చర్యలు చేపట్టారు. పిచ్చి మొక్కలను తొలగింపు చర్యలు ముమ్మరం చేశారు.. దీంతో కొంతవరకు కొంగల బెడద నుంచి ప్రజలను రక్షించొచ్చు అని ఎంపిడిఒ తెలిపారు. కొంగల సంరక్షణ కోసం అటవీ శాఖ అధికారులతో చర్చలు జరిపి వాటికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే సమయంలో ఎవరు ఎటువంటి ఇబ్బంది కలగకుండా కొంగలను వేరే ప్రదేశానికి సురక్షితంగా తరలేలే కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

నేరాలు ఘోరాలు

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరు శివారు బహిరంగ ప్రాంతంలో కోడి పందేలు జరుగుతున్నాయని సమాచారం మేరకు శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం ముందస్తు సమాచారం మేరకు మండల పరిధి గ్రామాల శివారు బహిరంగ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు వివరాలు అందాయన్నారు. దీంతో పోలీసుల గస్తీతో పాటు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో శుక్రవారం గుమ్మిలేరు శివారు ప్రాంతాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. దీంతో ఆకస్మిక దాడులు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసి, రూ. 3,090 నగదు తో పాటు రెండు కోళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ అన్నారు.

హత్య కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - రాజోలు

ప్రియురాలిని అత్యంత కిరాతంగా హత్య చేసిన ప్రియుడును పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి మీడియా ముందు ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించిన వివరాలను రాజోలు సీఐ టివి.నరేష్ కుమార్ వెల్లడించారు. ఈ నెల 16 వ తేదీ రాత్రి బి.సావరం సిద్ధార్థ నగర్ రెండవ వీధిలో తల్లి, నాలుగేళ్ల కుమారుడుతో కలసి అద్దె ఇంట్లో నివాసముంటున్న ఓలేటి పుష్పను రాజోలు కోళ్ల వారి వీధికి చెందిన షేక్ షమ్మా చాకుతో పొడిచి చంపాడని, అడ్డు వచ్చిన తల్లి, సోదరుడి పైనా చాకుతో దాడి చేశారని అన్నారు. మతురాలికి వివాహమై భర్తతో గొడవల కారణంగా విడిపోయిందని అన్నారు. షేక్ షమ్మాతో పుష్పకు పరిచయం ఏర్పడి ఏడాది కాలంగా సహజీవనం చేస్తున్నారని అన్నారు. చెడు అలవాట్లకు బానిస అయిన షమ్మా డబ్బుల కోసం మృతురాలి పుష్పను కొట్టేవాడని అన్నారు. బుధవారం రాత్రి పుష్ప కంప్యూటర్ క్లాస్ అని అమలాపురం తీసుకువెళ్లి తిరిగి వచ్చేటప్పుడు బోడసకర్రు బ్రిడ్జి పై ఆపి పుష్పతో డబ్బులు గురించి గొడవ పడి కొట్టాడని అన్నారు. ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత రాత్రి 10.30 సమయంలో మృతురాలి తల్లి, సోదరుడు వినాయక్ కలసి పుష్పను ఎందుకు కొట్టావు అని షమ్మాను అడగగా మీరు ఎవరు నన్ను అడగడానికి అని కబోర్డులో ఉన్న చాకుతో వారిపై దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వచ్చిన పుష్ప ఎడమ వైపు గుండెపై చాకుతో పొడవుగా విపరీతంగా రక్త స్రావమై అక్కడికక్కడే చనిపోయిందన్నారు. మృతురాలి తల్లి గంగ ఫిర్యాదు మేరకు కేసు మేరకు కేసు నమోదు చేశారన్నారు. కొత్తపేట డిఎస్‌పి సుంకర మురళీ మోహన్ పర్యవేక్షణలో రెండు టీమ్ లు ఏర్పాటు చేసి రాజోలు సిఐ నరేష్ కుమార్, ఎస్ఐ బి. రాజేష్ కుమార్ తమ సిబ్బంది తో కలసి గంటల వ్యవధిలో నిందితుడు షమ్మా ను అరెస్టు చేసి కేసును చాకచక్యంగా ఛేధించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట - పిఠాపురం రోడ్డులో విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. విద్యుత్ సరఫరా నిలిపివేసి ఉన్నప్పటికీ విద్యుత్ తీగలకు సరఫరా రావడంతో ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తోంది. హర్ష లిమిటెడ్ కంపెనీకి సంబంధించి పిఠాపురం రోడ్డు విస్తరణ పనులలో భాగంగా విద్యుత్ లైన్ మార్పు పనులు చేపట్టారు. కొందరు ప్రైవేటు కార్మికులు విద్యుత్ స్తంభంపై వున్న వైర్లను మారుస్తుండగా విద్యుత్ లైన్ వైరు తెగిపడి 11 కెవి వైరుపై పడడంతో ఒక్కసారిగా విద్యుత్ సరఫరా జరిగి స్తంభంపై పనిచేస్తున్న సామర్లకోట గణేష్ కాలనీకి చెందిన నులక బేతాలు (32)కు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు సామర్లకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్న సమయంలో బేతాలు మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం ఆసుపత్రి వద్ద నిరసన చేపట్టారు. మృతునికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై సిఐ ఎ.కృష్ణ భగవాన్ దర్యాప్తు చేస్తున్నారు

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై శుక్రవారం వ్యవసాయ శాఖ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. లింగంపర్తిలోని శ్రీకనక మహాలక్ష్మి ఎరువులు విత్తనాలు దుకాణంలో నిలువల వ్యత్యాసాలు, సరైన పత్రాలు లేని పురుగు మందులను అధికారులు గుర్తించారు. ఈ దాడుల్లో 15,725 మెట్రిక్ టన్నులు వ్యత్యాసాన్ని అధికారులు గుర్తించారు. వీటి విలువ రూ.1,18,503 ఉంటుందని అధికారులు తెలిపారు. దుకాణదారుడుపై 6 ఎ కేసు నమోదు చేశామన్నారు.

రికార్డుల్లేని బైకులు స్వాధీనం

ప్రజాశక్తి - జగ్గంపేట

కాట్రావులపల్లిలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు వారి సిబ్బం ది శుక్రవారం ప్రత్యేక బలగాలతో కలిసి కార్డెన్ అండ్ చర్చ్ నిర్వహించారు. ఈ కార్డెన్ అండ్ సెర్చ్‌లో రికార్డ్స్ లేని 13 బైక్స్‌ను గుర్తించి సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొల్లప్రోలు

గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. తాటిపర్తి పెద్ద రామాల యం వీధిలో ఉండే అమరాది శ్రీనివాస్ (39) బైకు పైనుంచి కింద పడ గాయపడ్డాడు. కాకినాడ ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి శుక్రవారం మృతి చెందాడు. దీనిపై గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుమార్తెతో సహా మహిళ అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరం గ్రామానికి చెందిన సబ్బితి మునికన్య, కుమార్తె సృజనతో కలిసి అదృశ్యమైంది. ఈ నెల 17న కుమార్తె కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆమె భర్త సబ్బితి కృష్ణరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వారి ఆచూకీ లభించలేదు. ఆచూకీ తెలిస్తే 9440904829, 9440904832 నెంబర్లకు సమా చారం ఇవ్వాలని సీతానగరం ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

3వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

కార్మికులు భారీ ర్యాలీ

ప్రజాశక్తి -కొవ్వూరు



నినదిస్తున్న మున్సిపల్ పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్ బాబు డిమాండ్ చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా కొవ్వూరులో మూడో రోజు కొనసాగింది. మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరం నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు, ఎల్ఐసి ఆఫీస్ రోడ్డు నుండి కాలేజీ రోడ్డు మీదుగా మెయిన్ రోడ్ మీదుగా కార్మికులు ర్యాలీ నిర్వహించారు. జెఎసి నాయకులు రాజన్న అప్పారావు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందర్‌బాబు ఈ సందర్భంగా మాట్లాడారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దుమ్ము, ధూళి, దుర్గంధం భరిస్తూ పట్టణ పరిశుభ్రతకు కాపాడుతున్న మున్సిపల్ కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినప్పటికీ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. గతంలో రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాలకు జిఒలు జారీ చేయకపోవడం దారుణం అన్నారు. ఆప్కాస్ సంస్థను సైతం రద్దు చేసి ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించాలనుకోవడం సరికాదన్నారు. తల్లికి వందనం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కూడా అమలు చేయకపోవడం అన్యాయమని అన్నారు. షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారిశుధ్య కార్మికులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం సమ్మె శిబిరానికి అగ్రికల్చర్ కాంటాక్ట్ వర్కర్స్ జెఎసి చైర్మన్ నక్క వెంకటరత్నం, సిఐటియు మాజీ నాయకులు పి.గంగాధర్‌రావు హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. ఇచ్చి మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. భూపతి రవీంద్ర, పూజారి వాసు, కళ్యాణ్ రాజేష్, వడ్డాది శ్యామ్, అల్లం వెంకటలక్ష్మి, మీసాల దుర్గ,అల్లం వాణి, పూర్ణ కళ్యాణ్, బత్తుల రాజేంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

రసాయన శాస్త్రంపై ఆసక్తి పెంపునకు ల్యాబ్ ఆన్ వీల్స్

ప్రజాశక్తి - సీతానగరం



ల్యాబ్ టు స్కూల్‌లో పాల్గొన్న అధ్యాపకులు, పీజీ విద్యార్థులు

రాజమహేంద్రవరంలోని స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (అటానమస్) రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకులు, పీజీ విద్యార్థులు శుక్రవారం సీతానగరం మండలం వేదుళ్ళపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థుల్లో రసాయన శాస్త్ర ప్రయోగాలపై ఆసక్తిని పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.వి.వి. సత్యనారాయణ, ఇంచార్జ్ వి. శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి స్వాగతం పలికి పూర్తి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 8, 9, 10వ తరగతుల పాఠ్యప్రణాళికలో ఉన్న రసాయన శాస్త్ర ప్రయోగాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా ప్రదర్శించి వివరించారు. ముఖ్యంగా, ద్రావణాల్లో రకాలు, ఆమ్లాలు, క్షారాలు, పిండి పదార్థాలు, ప్రోటీన్లను గుర్తించే పరీక్షలు, రసాయన చర్యల్లో రకాలను ప్రయోగపూర్వకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమం కోసం కళాశాల ప్రిన్సిపల్ రామచంద్ర హై గ్లో బస్సును ఏర్పాటు చేశారని హైస్కూల్ హెచ్‌ఎం ఎన్‌వివి.సత్యనారాయణ తెలిపారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఎల్.రాజేశ్వరి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ రసాయన శాస్త్ర అధ్యాపకులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - చాగల్లు

స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ చాగల్లు సబ్ స్టేషన్ వద్ద శనివారం ఉదయం 9 గంటలకు నిరసన దీక్ష నిర్వహిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరు కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ టికె.విశ్వేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై పెనుభారం పడుతుందన్నారు. దీనికి వ్యతిరేకంగా ఈ ధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు కానూరులో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి - పెరవలి

మండలం కానూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం 9 స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం జరుగుతుందని ఎంపిడిఒ పద్మజ తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి కందుల దుర్గేష్ హాజరవుతారన్నారు. దీన్ని విజయవంతం చేయాలని కోరారు.

స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ నిర్వహణపై సమావేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా స్కూల్ క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం నుంచి ప్రారంభం అవుతున్నాయని డిఎంహెచ్ స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రవికుమార్ తెలిపారు. స్థానిక బైపాస్ రోడ్‌లోగల డిఎంహెచ్ స్కూల్లో శుక్రవారం సాయంత్రం కాంప్లెక్స్ నిర్వహణపై సంసిద్ధతా సమావేశం నిర్వహించారు. క్లస్టర్ కాంప్లెక్స్ అజెండా, సమయసారిణిని కాంప్లెక్స్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించారు. ఇకపై క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ప్రతీ నెల మూడవ శనివారం మధ్యాహ్నం ఒక పూట మాత్రమే జరుగుతాయన్నారు. ఉదయం అన్ని పాఠశాలలు యథావిధిగా పనిచేస్తాయన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం తరగతులు ఉండవన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఉపాధ్యాయులు కాంప్లెక్స్ సమావేశాలకు హాజరవుతారన్నారు. అధికారుల ముందస్తు అనుమతి లేనిదే ఎవరూ సెలవు పెట్టరాదని, ఉపాధ్యాయులు అందరూ విధిగా హాజరవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కాంప్లెక్స్ కార్యదర్శి పరస జగన్నాథరావు, సిఆర్‌ఎంటి జయంతి శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటం

ప్రజాశక్తి - మండపేట

అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలపై రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలలోని ఉద్యోగులు ఐక్యంగా పోరాటం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, కోనసీమ జిల్లా అధ్యక్షులు మద్దాల బాపూజీ పిలుపునిచ్చారు. శుక్రవారం మండపేట తహశీల్దార్ కార్యాలయం మీటింగ్ హాలులో మండపేట తాలూకా ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. తాలూకా అధ్యక్షులు ఎంవివిఎన్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాపూజీ పాల్గొని మాట్లాడుతూ పెండింగ్ డిఎ లు, పిఆర్‌సి కమిషనర్ ఏర్పాటు, ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిల పై ఈనెల 25, 26 తేదీలలో విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కాశీభట్ల రామసూరి నారాయణ అధ్యక్షతన జరిగే సమావేశంలో ఉద్యోగుల కీలక నిర్ణయాలు చేయనున్నటు తెలిపారు. ఉద్యోగులు అధైర్యం పడవద్దని ఎపిజిఇఎ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. కూటమి ప్రభుత్వం హామీ అమలు కు రాష్ట్రంలో వివిధ ఉద్యోగ సంఘాల తరపున సూర్యనారాయణ పెద్దన్న పాత్ర పోషిస్తున్నారనితెలిపారు.ఈ నేపథ్యంలో కోనసీమ జిల్లాలోని అన్ని తాలూకాలలో ఎపిజిఇఎ సమావేశాలు జరిపి నూతన కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని బాపూజీ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆలమూరు, రాయవరం, మండపేట మండలాల తాలూకా నాయకులు ఎంవివి విఎన్.ప్రసాద్, విఆర్‌ఒల జిల్లా ఉపాధ్యక్షులు బలుసు రామకృష్ణ, కె.జ్యోతి కుమార్, ప్రభుదాసు, వెంకటేశ్వరరావు, జేజి బాబు, రవి, వెంకాయమ్మ, మేరీ, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.



సమస్యలపై మాట్లాడుతున్న బాపూజీ



సారె పంపుతున్న బాలబాలాజీ స్వామి ఆలయ సహాయ కమిషనర్

కనక మహాలక్ష్మి అమ్మవారికి సారె

ప్రజాశక్తి - మామిడికుదురు

బాల తిరుపతి అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామివారి దేవస్థానం నుంచి శుక్రవారం గ్రామ దేవత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆషాఢ మాస సారె సమర్పించామని ఆలయ సహాయ కమిషనర్ వి సత్యనారాయణ తెలిపారు. బాల బాలాజీ ఆలయం నుంచి ఊరేగింపుగా పట్టుచీర, జామారు గజమాల, పరిమళ పుష్పాలు, మూడు కావిల్లు చలిమిడి వడపప్పు, పానకము, పండ్లు, లడ్డూలు, పలు రకాల స్వీట్లు భక్తితో సమర్పించామన్నారు గ్రామం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ఈ విశేష కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ సహాయక కమిషనర్ తెలిపారు .ఈ కార్యక్రమంలో యాత్రికులు గ్రామస్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి. సత్యనారాయణను అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

పాశర్లపూడి లంకలో సిసి రోడ్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి లంక లో రూ.1.20 కోట్ల వ్యయంతో నిర్మించబోతున్న సీసీ రోడ్లకు ఎమ్ ఎల్ ఎ గిడ్డి సత్యనారాయణ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత గ్రామీణ రహదారుల అభివద్ధికి ఉపాధి హామీ చట్టం ద్వారా నిధులు మంజూరవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు ఆయన అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని చొల్లంగిలోని గురజనాపల్లి కూడలి వద్ద జాతీయ రహదారి దాటుతుండగా బైకు ఢీకొని ఒక మహిళ మృతి చెందినట్లు కోరంగి ఎస్ఐ. పి.సత్యనారాయణ తెలిపారు. చొల్లంగికి చెందిన పుల పకూర మరియమ్మ (49) శుక్రవారం జాతీయ రహదారి దాటుతుండగా యానాం నుంచి వస్తున్న బైకు బలంగా ఢీకొనడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కాకినాడ తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందిందని తెలిపారు. మథతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఇసుక అక్రమ వ్యాపారంపై కేసు నమోదు

ప్రజాశక్తి-కోటనందూరు

మండల కేంద్రమైన కోటనందూరులో తుని-నర్సీపట్నం రోడ్డుకు సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక అమ్మకం నిర్వహిస్తున్న వ్యక్తిపై ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దారు టి.సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్న నేపథ్యంలో, ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను డంప్ చేసి విక్రయిస్తే వారిపై, తాండవ నదిలో ఇసుక త్రవ్వకాల్లో వసూళ్లకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - రావులపాలెం

సిఐ టౌన్ ఎం.శేఖర్ బాబు, ఎంవిఐ వి.శ్రీనివాస్ ఆటో డ్రైవర్లకు శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటిం చాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కెవి.రమణారెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై సదస్సు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో అజ్జరం, ఉసులుమర్రు గ్రామాల్లో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్య వివాహాల అనర్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండకుండా బాల్యవాహాలు చేయకూడదాన్నారు యుక్త వయసు రాకుండా చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. పిల్లల అనారోగ్యంగా పుడతారన్నారు.శారీరక సమస్యలతో పాటూ మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి నిధుల మంజూరు

ప్రజాశక్తి - సీతానగరం

రాజానగరం నియోజకవర్గంలో కీలక రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని, ఈ పనులను త్వరగా ప్రారంభించాలని రాజానగరం ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ అధికారులను ఆదేశించారు. ఎటువంటి జాప్యం లేకుండా పనులు మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరంలోని ఎంఎల్ఎ కార్యాలయంలో ఆయన అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతానగరం నుంచి పురుషోత్తపట్నం రోడ్డు పనులను వెంటనే చేపట్టాలన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఈ రోడ్డు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. కోటి, కూనవరం, కోరుకొండ పోలీస్ స్టేషన్ రోడ్డు, గాడాల నుంచి పాలచర్ల రోడ్డు పనుల పురోగతిని సమీక్షించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద మంజూరైన కమ్యూనిటీ హాల్ పనులను సైతం ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ సమీక్షా సమావేశంలో ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బొబ్బిలంక గ్రామంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. అడిషనల్ ఎస్‌పి మురళీకృష్ణ పర్యవేక్షణలో ఎడిఎ రవీంద్ర ఈ తనిఖీలను నిర్వహించారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ప్రారంభమైన ఈ తనిఖీ మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగింది. ఎలాంటి అవకతవకలు గుర్తించలేదని తనిఖీ అధికారులు తెలిపారు. ఈ తనిఖీలో కోరుకొండ ఎడిఎ మల్లికార్జునరావు, సీతానగరం ఎఒ ఎ.గౌరీదేవి, ఎఇఒ గురుప్రియ, గ్రామ వ్యవసాయ సహాయకురాలు రమాదేవి పాల్గొన్నారు.